క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



గూడూరు: మండల పరిధిలోని పోలవరంలో ఈనెల 17న జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన మురాల లక్ష్మీకుమారి కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్థిక సహాయం అందజేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు, దుస్తులు, రూ.2 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో లంకిశెట్టి బాలాజీ, మాజీ ఏపీపీ అడపా మురళి, కూతని ఈశ్వర రామాంజనేయులు, శీతంశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో డీఎస్సీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 157 మంది హాజరయ్యారని, 23 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 142 మంది హాజరయ్యారని, 38 మంది ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 299 మంది హాజరవ్వగా 61 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని తెలిపారు.

నేత్ర దానం



వెంకట సుబ్బారావు (ఫైల్)

నాగాయలంక: స్థానిక పన్నెండో వార్డుకు చెందిన నంబూరి వెంకట సుబ్బారావు (65) అనారోగ్యంతో ఆదివారం మరణించగా అతని నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో స్థానిక కిరాణా మర్చంట్స్ యూనియన్ నేత మానేపల్లి శ్రీనివాసరావు ప్రోత్సాహంతో మృతుని భార్య పద్మావతి, కుమారుడు శివ నాగరాజు, కుమార్తె కుందా లక్ష్మీపావని ఇతర కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకొచ్చారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి ఐటెక్నీషియన్ సాయి బృందం వచ్చి మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ మోటివేషన్‌తో ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 236కి చేరిందని రఘుశేఖర్ చెప్పారు.

సీపీఐఎంఎల్ నేతకు పరామర్శ



కోడూరు: మండలంలోని పిట్టల్లంక గ్రామానికి చెందిన సీపీఐఎంఎల్ నేత మారుబోయిన పూలేంద్రరావును మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. పూలేంద్రరావు అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీంతో ఆయన ఆరోగ్య వివరాలను రమేష్‌బాబు అడిగి తెలుసుకున్నారు. యువ నేత సింహాద్రి వికాస్, నేతలు సంగా గోపాలకృష్ణ, మలిశెట్టి వెంకటేశ్వరరావు, ఇంకొల్లు శేషగిరి, బావిశెట్టి పూలేంద్రరావు, గండు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.48 లక్షలతో అదనపు గదుల నిర్మాణం



కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో మన బడి- మన భవిష్యత్ నిధులు రూ.48 లక్షలతో నాలుగు అదనపు గదుల భవనం నిర్మిస్తున్నారు. ఈ నిధులతో కింద రెండు రూములు, పైన రెండు రూముల నిర్మాణం చేపట్టారు. పైన ఒక్కొక్క గదికి రూ.13 లక్షలు, కింద ఒకొక్క గదికి రూ.11 లక్షల చొప్పున కేటాయించి రూములు నిర్మిస్తున్నట్లు ఏఈ రాంబాబు తెలిపారు. విద్యాకమిటీ చైర్మన్ మత్తి నాంచారమ్మ, వైస్ చైర్మన్ కొక్కిలిగడ్డ స్వప్న, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు సాగుతున్నట్లు ఆయన వివరించారు.

అడుగడుగునా మడుగులే!

- అధ్వానంగా ప్రధాన రహదారులు
- ద్విచక్ర వాహనాలూ తిరగలేని పరిస్థితి
- కిలోమీటర్ల మేర గుంతలమయం



వర్షం వచ్చినప్పుడు చెరువును తలపిస్తున్న చందాల-నిడమర్రు రహదారి

కృత్తివెన్ను: గ్రామాలను కలుపుతూ పోయే ప్రధాన ఆర్ అండ్ బీ రహదారులు మడుగులను తలపిస్తున్నాయి. వాహనదారులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. పెద్ద వాహనాలు సంగతి సరేసరి. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా తిరగలేని స్థితిలో రహదారులు ఉన్నాయి. వీటిపై ప్రయాణం దినదినగండంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలంలో ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రయాణాలకు ఏమాత్రం అనుకూలంగా లేవు. చిన్నపాటి వర్షం పడితే ఏకంగా చెరువులను తలపించేలా రోడ్లు మారిపోతున్నాయి. వీటిపై ప్రయాణం చాలా కష్టంగా ఉంటోందంటున్నారు ప్రజలు.

కిలోమీటర్ల మేర అధ్వానమే

మండలంలో నీలిపూడి, కొమాళ్లపూడి, పాటిమీద, గొల్లగూడెం, సీతనపల్లి గ్రామాలకు ఏకైక మార్గంగా ఉన్న మునిపెడ నుంచి నీలిపూడి, కొమాళ్లపూడి మీదుగా సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిని కలిపే ప్రధాన రహదారి సుమారు 9 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉంది. ఈ మార్గం నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు కృత్తివెన్ను, బంటుమిల్లి సెంటర్లకు రోజూ వివిధ అవసరాలపై వెళ్లిరావాల్సి ఉంది.

నిత్యం ప్రత్యక్ష నరకం

రహదారి పాడైపోవడంతో వారు నిత్యం ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. చందాల వద్ద నుంచి దోమనగొంది మీదుగా నిడమర్రు చేరే రోడ్డు మరింత ధ్వంసమై చెరువులను తలపిస్తున్నాయి. ఇక్కడ కూడా నాలుగు గ్రామాల ప్రజలకు ఈ మార్గమే ప్రధానం. సత్రవపాలెం నుంచి ఇంతేరు వరకు, చినగొల్లపాలెం దీవిలో 10 కిలోమీటర్లు రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. ఇవన్నీ నిత్యం ప్రజల రాకపోకలకు అత్యవసరమైన రహదారులు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించి రోడ్ల నిర్మాణాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షం వచ్చినప్పుడు మునిపెడ- కొమాళ్లపూడి దుస్థితి

పాలకులు దృష్టి సారించాలి



మా గ్రామం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, కృత్తివెన్ను ప్రధాన సెంటరుకు వెళ్లాలన్నా, జాతీయ రహదారిని చేరాలన్నా చందాల నుంచి మా ఊరికి ఉన్న రోడ్డే ప్రధానమార్గం. అది పూర్తిగా ధ్వంసమైపోయింది. పాలకులు దీనిపై దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేయాలి.

– బి. వెంకటస్వామి, నిడమర్రు

ప్రయాణంలో పోరాటమే



మా గ్రామంలో 90 శాతం మంది రైతులు, రైతు కూలీలే. ప్రతి చిన్న అవసరానికి బంటుమిల్లికి వెళ్లాల్సిందే. బంటుమిల్లి చేరాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు మేర ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే రోజూ ఒక యుద్ధమే చేయాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకోవాలి.

– పోశం రాము, నీలిపూడి

నిధులు మంజూరయ్యాయి

మండలంలో రెండు ఆర్ అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కొత్తకాలువ నుంచి ఏటిమొండి వరకు రూ.4.20 కోట్లు, మునిపెడ నుంచి నీలిపూడి మీదుగా సీతనపల్లి వరకు రూ.5 కోట్ల వంతున రెండు బిట్లుగా మంజూరయ్యాయి.

– కిషోర్, ఏఈఈ, ఆర్ అండ్ బీ

ముగిసిన గ్రామ దేవతల సంబరాలు



మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

పెడన: మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గ్రామ దేవతల సంబరాల మహోత్సవాలు అంగరంగవైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో గత 11 రోజులు నిర్వహించగా చివరి రోజు ఆదివారం 12వ రోజుతో ముగిశాయి. గ్రామంలో వెలసిన మహంకాళమ్మ తల్లి, గంగానమ్మతల్లి, అంకమ్మ తల్లి, పోతురాజు, నాగేంద్రస్వామి సంబరాల మహోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి ఆదివారం వరకు నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో గ్రామంలోని గ్రామదేవతల ఆలయం ముందు భారీగా భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. సంబల వారు అంకగుడారం వేసి పోటు గొర్రెపొడిచి గ్రామ దేవతలకు వేడి నైవేద్యాలను సమర్పించారు. రాత్రికి కొర్లబండి ఊరేగింపుతో ఊరి పొలిమేరకు సాగనంపారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు వచ్చి ఆయా అమ్మవార్లకు మొక్కుబడులు తీర్చుకున్నారు. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ సత్యనారాయణ, కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు తదితరులు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల్లో డొల్లతనం

నిర్మాణ దశలో కూలిన డ్రెయిన్ గోడ



కూలిన డ్రెయినేజీ గోడ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు హిందూ శ్మశానవాటిక వద్ద జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. నిర్మాణ దశలో ఉన్న డ్రెయిన్ గోడ సగానికి ధ్వంసమై కూలడంతో ఏ మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో అర్థమవుతుంది. పంచాయతీ నిధులు సుమారు రూ.25 లక్షలతో తొలి దశగా చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు కాంట్రాక్టర్ తిలోదకాలిచ్చారు. ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్‌తో పాటు మురుగు నీటి సమస్యను ఉన్నతాధికారుల ఆదేశాల నిమిత్తం పరిష్కరించేందుకు ఇటీవల డ్రెయిన్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. డ్రెయిన్‌ను ఈ శ్మశానవాటిక నుంచి వాటర్ ట్యాంక్ వరకూ నిర్మించాల్సి ఉంది.

అధికారులు స్పందించాలి..

గ్రామంలోని మురుగునీరు ఈ అండర్ గ్రౌండ్ డ్రెయిన్ ద్వారా కాలువలో కలిసే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ పనుల్లో భాగంగా డ్రెయిన్‌కు ఇరువైపులా గోడలు నిర్మించి పనులు సాగిస్తున్నారు. మండలాధికారుల పర్యవేక్షణ, నిర్మాణ పనుల నాణ్యత పరిశీలించకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నాలుగు రోజుల క్రితం నిర్మించిన డ్రెయిన్ గోడ కూలిపోయింది. ఇంకా రెండు దశల్లో సుమారు రూ.80 లక్షల మేర పనులు నిర్వహించాల్సి ఉందని, పనుల ప్రారంభంలోనే గోడ కూలిపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ ఘటనపై విచారణ జరపాలని, అర్హత కలిగిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

సంక్షేమ బోర్డులో జీవో నంబర్ 1213 రద్దుకు డిమాండ్



మాట్లాడుతున్న నాగబ్రహ్మాచారి తదితరులు

గన్నవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకుడు మోటమర్రి నాగబ్రహ్మాచారి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికీ పాత క్లైమ్‌లు చెల్లించడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ బోర్డులో 1213 జీవోను రద్దు చేసి పాత క్లైమ్‌లు తక్షణం చెల్లించాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం జూలై 9న మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామన్నారు. అనంతరం సంఘ అధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శిగా చెరువుగట్టు ప్రసాద్, నాగబ్రహ్మాచారితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

26 నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాఢ మాసం సందర్భంగా వారాహి నవరాత్రులను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో ప్రతి రోజు రాత్రి 7 గంటలకు అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తరం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ నెల 29న ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లికి ఆషాఢ సారెను భక్తులచే సమర్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా శ్రీఅంకమ్మతల్లికి మొదటి బోనం సమర్పిస్తామన్నారు. వారాహి నవరాత్రుల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.గోవిందరావు ఆదివారం తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శారదానగర్, కోన సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మోపిదేవి: మపిదేవిలో గత కొంతకాలంగా యాచన చేస్తూ జీవిస్తున్న శివ (72) అనే వృద్ధుడు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న పంచాయతీ అధికారులు స్థానిక రెవెన్యూ, పోలీసులకు తెలియజేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరావు తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో అనాథ శవంగా గుర్తించి సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు.

గంట సమర్పణ



కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న వేళ్లమ్మ అమ్మవారికి కోడూరుకు చెందిన చిట్టిప్రోలు వెంకట రామకృష్ణ- పద్మావతి దంపతులు నగరా గంటను బహూకరించారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తికి నైవేద్యాలు సమర్పించారు. రూ.13,500 విలువ చేసే ఎలక్ట్రికల్ గంట (నగరా గంట)ను రామకృష్ణ దంపతులు కమిటీ సభ్యులకు అందించారు. ఆలయంలో ధూపదీప నైవేద్యాలు, హారతుల సమయంలో ఈ గంటను వినియోగించనున్నట్లు చెప్పారు. దాతను కమిటీ సభ్యులు గట్టా వెంకటేశ్వరరావు, అద్దంకి తిరుమలేశ్వరరావు సత్కరించారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



పాణుకుమాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పాణుకుమాడు గ్రామ పంచాయతీకి దాత చెరుకూరి భానుమతి, వారి కుటుంబ సభ్యులు రూ.80 వేలు విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. ఈ మేరకు ఆదివారం సర్పంచి అన్నే సుబ్బలక్ష్మి సమక్షంలో గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. గ్రామస్తుల సౌకర్యార్థం ఉచితంగా ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన దాతకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావాలని కోరారు. మాజీ సర్పంచి చింతల శ్రీనివాసరావు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



యువత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం యువత పోరు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ యువ నేత సింహాద్రి వికాస్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్‌తో చెలగాటం ఆడుతుందని చెప్పారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని వికాస్ డిమాండ్ చేశారు. యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో చేపట్టిన యువతపోరు కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత, నిరుద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలో మాజీ సీఎం జగన్ పర్యటనలో తెలుగుదేశం సానుభూతిపరుడు ప్లకార్డు ప్రదర్శిస్తే దానిని కూడా జగన్‌కు ఆపాదించాలని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. రానున్న నాలుగేళ్లలో ప్రజల తరుపున పోరాటాలు చేసేందుకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చింతలపూడి బాలు, గార్లపాటి గోపీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా సోమశేఖర్



రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు సంకటి నుంచి నియామక పత్రం అందుకుంటున్న సోమశేఖర్

నాగాయలంక: అవనిగడ్డ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా భోగాది సోమశేఖర్ నియమితులయ్యారు. మండలంలోని తలగడదీవికి చెందిన సోమశేఖర్ మండల శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సంకటి లక్ష్మణరావు విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో సోమశేఖర్‌కు నియామకపత్రం అందజేశారు. నాగాయలంకకు చెందిన తోట శ్రీనివాసరావును నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. కాపు సంఘీయుల శ్రేయస్సు, సంఘ పటిష్టత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సంకటి సూచించారని నియోజకవర్గ నేతలుగా నియమితులైన చిన్నారి, శ్రీ నివాసరావు తెలిపారు. వారు మాట్లాడుతూ కాపుల సంక్షేమంలో భాగంగా ప్రధానమైన కాపు కల్యాణ మండపాలను తక్షణమే నిర్మించాలని, కాపుల సామాజికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా కాపుల సంక్షేమమే లక్ష్యంగా ఐక్యతతో ముందుకు సాగాలని ఇప్పటికే గ్రామ స్థాయి సమావేశాల్లో తీర్మానించామని ఆ దిశగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తమకు అవనిగడ్డ నియోజకవర్గం పీఏఆర్ కాపునాడు బాధ్యతలు అప్పగించిన లక్ష్మణరావుకు వారు కృతజ్ఞతలు చెప్పారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



కొత్తమాజేరు జెడ్పీ హైస్కూల్ పదో తరగతి 1990- 91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: మూడున్నర దశాబ్దాల క్రితం బాలబాలికలుగా తలోదిక్కుకు వెళ్లిపోయి నేడు బాధ్యత గల పౌరులుగా మళ్లీ ఒకే వేదికమీద కలుసుకుని సంతోషాలు పంచుకున్నారు. మండల పరిధిలోని కొత్తమాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990- 91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ గత అనుభవాలను గుర్తు తెచ్చుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు పీతా కోటేశ్వరరావు, ఎస్.బేగంలను ఘనంగా సన్మానించారు. ఒకరి అనుభవాలను మరొకరితో పంచుకుంటూ సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

రైతులకు అందించిన సేవలు నిరుపమానం



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండల వ్యవసాయాధికారిగా కంచర్ల శివప్రసాద్ ఎనిమిది సంవత్సరాలుగా రైతులకు అందించిన సూచనలు వెలకట్టలేనివని అతిథులు పేర్కొన్నారు. మొవ్వ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించి గన్నవరానికి బదిలీ అయిన శివప్రసాద్‌కు ఆదివారం ఆ శాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పెడసనగల్లు రోడ్డులోని కూచిపూడి పెదపూడి వర్తకసంఘ కల్యాణమండపంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, బార్లపూడి నీటి సంఘం అధ్యక్షుడు తాతినేని పూర్ణచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సూరపనేని శ్యామల, చల్లపల్లి ఏఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్టించేందుకు అర్చకులతో పూజలు చేయించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపుకుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగా శ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు.